వారాంతపు సంతలు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలో ప్రతివారం కూరగాయాలు, ఇతర సామగ్రి విక్రయించే వారంతపు సంతల సమాచారం ఈ విధంగా ఉన్నాయి. సోమవారం - రైల్వే స్టేషన్ రోడ్డు (పోలీస్ క్వార్టర్స్ రోడ్డు), అత్వెల్లి, రాఘవేంద్ర నగర్ కాలనీ, మంగళవారం-ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్, బుధవారం- ఎన్జీఓస్ కాలన(మేడ్చల్), గురువారం-వీకర్ సెక్షన్ కాలనీ (జెడ్పీహెచ్ఎస్ స్కూల్), శుక్రవారం-సూర్యనగర్, చంద్రానగర్, శనివారం-హౌజింగ్‌బోర్డు కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ, ఆదివారం- ప్రధాన మార్కెట్‌లో నిర్వహించనున్నారు.

కమిషనర్‌తో కాంగ్రెస్ నేతల భేటీ

మేడ్చల్: ఎల్లంపేట్ మున్సిపల్ కమిషనర్ స్వామినాయక్‌ను మున్సిపల్ కాంగ్రెస్ నేతలు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో కలిశారు. ఎల్లంపేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు విఘ్నేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కమిషనర్‌ను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మాజీ సర్పంచ్ సంజీవ రావు, నాయకులు సలాం, సుధాకర్, ప్రభాకర్ తదితరులున్నారు.

కార్మికుల సమస్యలపై ధర్నా

జవహర్‌నగర్: కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పడం విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి శివబాబు అన్నారు. కార్మికుల సమస్యలపై ధర్నా విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం జవహర్ నగర్ కార్పొరేషన్ రాజీవ్‌గాంధీనగర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రతి భవన నిర్మాణ కార్మికులు ఈ ధర్నాకు రావాలని పిలుపునిచ్చారు.

నేటి నుంచి పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు

కీసర: బోగారంలోని పశు వైద్యశాలలో నేటి నుంచి ఈనెల 30 వరకు పశువులకు ఉచితంగా గాలి కుంటు టీకాలు ఇస్తున్నట్లు పశువైద్యులు రవిప్రకాష్‌గౌడ్ తెలిపారు. రైతు సోదరులు తప్పనిసరిగా తమ పశువులకు విధిగా టీకాలు వేయించాలని కోరారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న రెవెన్యూ అధికారులు

జవహర్‌నగర్: కార్పొరేషన్ పరిధిలో కాప్రా తహసీల్దార్ సుచరిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను మంగళవారం కూల్చివేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వానికి ఇంటిపన్ను, విద్యుత్, నల్లా బిల్లులు చెల్లిస్తున్నామని, పెద్ద పెద్ద భవనాలను వదిలేసి పేదల ఇంటిని కూల్చివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. పేదల ఇంటిని కూల్చుతుంటే ఇళ్లను కూల్చొద్దని రెవెన్యూ, పోలీసులపై బాధితులు రాళ్లురువ్వారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం కమిషనర్ వెంకట్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి వార్డులో శుభ్రతకు ప్రాధాన్యతమివ్వాలని, మురుగు, చెత్తసేకరణ, హరితహారం కార్యక్రమాలు అమలు చేయాలని ఆదేశించారు. అంకిరెడ్డిపల్లిలో పర్యటించి స్థానికులతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఆటో డ్రైవర్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ తొలగింపుపై నిరసన

ఘట్‌కేసర్: ఫ్యాకల్టీ తొలగింపుపై అంకుషాపూర్‌లోని ఓ ఇంజినీరింగ్ కళాశాల ఎదుట తెలంగాణ ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్‌ఎఫ్), ఎస్ఎఫ్ఐ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇంటర్నల్ ఆరోపణలకు సంబంధం లేని వారిని తొలగించడం అన్యాయమని నినాదాలు చేశారు. కళాశాల యాజమాన్యం అకడమిక్ మధ్యలో ఫ్యాకల్టీని తొలగించి కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

ఆరోపణలు అవాస్తవం...

అర్హులతోనే బోధన చేయిస్తున్నామని, విద్యార్థి సంఘాల నాయకులు కావాలనే కళాశాలపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సదరు కళాశాల యాజమాన్యం మండిపడింది.

కష్టాల కడలిలో బతుకులు !

• కుమ్మరుల జీవితం కడు దైన్యం • మట్టి పాత్రలకు గిట్టుబాటు కరువు • కృత్రిమ ధాటికి విలవిల

దీపావళి వచ్చిందంటే ఏ ఇంట్లోనైనా ప్రమిదలతో అందంగా అలంకరిస్తారు. చల్లటి నీళ్లను అందించే కుండను కూడా మట్టి నుంచే తయారు చేస్తారు. ఇదంతా నాణేనికి ఓ వైపు.. అదే కుండలను తయారు చేసే మట్టి మనుషుల (కుమ్మరి కులస్తుల) జీవనచిత్రం అందుకు భిన్నంగా ఉంటోంది. మట్టి సేకరణ నుంచి వస్తువుల తయారీ వరకు వారు పడే తపన అంతా ఇంతా కాదు. రెడీమెడ్ భూతం సమీప ప్రాంత ప్రజల ఉపాధికి గండికొడుతోంది. తాము తయారుచేసిన వస్తువులు అమ్ముడుపోకపోవడంతో వారు ఆర్థికంగా కొట్టుమిట్టాడుతున్నారు.

– జవహర్‌నగర్



మట్టితో తయారు చేసిన ప్రమిదలు



దిగుమతులతో అవస్థలు..

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో అనేక మంది కుమ్మరులు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. కుండలు, దుత్తలు, కుండీలు, ప్రమిదలు తదితర వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నారు. ఒకప్పుడు ఎంతో ఆనందంగా జీవించిన కుమ్మరులు ప్రస్తుతం ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అయ్యే వస్తువులతో గిరాకీ లేక కష్టాల కడలిలో ఎదురీదుతున్నారు. గతంలో ఎడ్లబండ్లలో కుండలు, పాత్రలు, ప్రమిదలు తీసుకొచ్చారంటే గంటలో అమ్ముడయ్యేవి. ప్రస్తుతం ప్లాస్టిక్ కుండలు, పాత్రలు, రెడీమెడ్ దీపాలు వారి ఆదాయానికి గండికొడుతున్నాయి. దీపావళి పండుగ వస్తుందంటే చాలా వారి ఇళ్లలో నిత్యం కనిపించే కొనుగోలుదారుల సందడి కనుమరుగైంది. రాజస్థాన్, బెంగళూర్ ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు దీపాలు, ఇతర కళాకృతులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రంగులు, వివిధ ఆకృతులు, డిజైన్లు ఉండటంతో వాటినే కొనుగోలు చేయడానికి ప్రజలు మొగ్గుచూపుతున్నారు.

కుండెడు కష్టాలు...

మట్టిని పాత్రగా మలిచే క్రమంలో వారి కష్టాలు వర్ణణాతీతం. కష్టపడి తయారు చేసినా మార్కెట్లోకి వెళ్లే సరికి నిరాశే ఎదురవుతోంది. ఇతర ప్రాంతాల్లో యంత్రాలతో తయారు చేసి తీసుకొచ్చే ప్రమిదలే అందుకు కారణం. యంత్రాల పోటీని కుమ్మరులు తట్టుకోలేకపోతున్నారు.

ఖర్చెక్కువ.. గిట్టుబాటు తక్కువ

కష్టపడి రంజన్లు చేసినా గిట్టుబాటు దొరకకపోవడంతో సంపాదన పెద్దగా ఏమీ ఉండటం లేదు. దినసరి కూలీలకన్నా తక్కువే.. ఆదాయం ఉంటోంది. కొందరైతే అప్పుచేసి మరీ కుండలు తయారు చేస్తున్నారు. అయితే వీరికి ప్రభుత్వ పరంగా రుణాలేవి అందడం లేదు.

మా వృత్తికి సహకారం అందించాలి

ఎన్నో ఏళ్లుగా ఇదే వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నాం. మిషన్లపై తయారు చేసిన ప్రమిదలు తీసుకురావడంతో మేము చేతితో చేసిన వాటిపై ప్రజలు మక్కువ చూపడం లేదు. మేము కూడా అలాంటివి చేద్దామనుకుంటే ఆ మిషన్ల ఆచూకీ తెలవడం లేదు. దీంతో చాలా నష్టపోతున్నాం. మా వృత్తిని అభివృద్ధి చేద్దామంటే ఏ సహాయ సహకారాలు అందడం లేదు.

– సత్యనారాయణ, అంబేడ్కర్‌నగర్

ప్రభుత్వం స్థలాన్ని కేటాయించాలి



తాతల నుంచి కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సహకారం అందలేదు. అనేకసార్లు వినతిపత్రాలు అందించినా పట్టించుకోవడం లేదు. జవహర్‌నగర్‌లో మాకు అనువైన చోట ప్రభుత్వం పదెకరాల స్థలం కేటాయిస్తే ఆధునిక యంత్రాలతో కుండలను తయారు చేసి, శివారు పట్టణాలకు అందిస్తాం. ప్రభుత్వం మా కష్టాన్ని గుర్తించి స్థలాలు కేటాయించి రుణాలు ఇప్పించాలి.

– ఆరూరి నర్సింహ, బాలాజీనగర్

కులవృత్తులకు ప్రాధాన్యతనిస్తున్నాం



ప్రభుత్వం కులవృత్తులకు పెద్దపీట వేస్తోంది. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో కుమ్మరులు దుర్భర జీవితాలను గుడుపుతున్నారు. ఇక్కడ సరైన స్థలం లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి కుండలు కొనుగోలు చేసుకుంటున్నారు. స్థలం కేటాయించాలని కుమ్మరి సంఘం సభ్యులు వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉంది. వీలైనంత త్వరలో కుమ్మరి కులస్తులకు స్థలాన్ని కేటాయించేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌యాదవ్, జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు

కార్తీకమాస మహోత్సవ పత్రికావిష్కరణ



కీసరలో కార్తీకమాస మహోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ పాలకమండలి సభ్యులు



కాలభైరవ అభిషేకం చేస్తున్న ట్రస్ట్ బోర్డు సభ్యులు

ఆలయంలో పలు అభివృద్ధి పనులపై సమీక్ష

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానం పరిపాలన భవనంలో బోర్డు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్తీకమాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కార్తీకమాస మహోత్సవ పత్రికను మంగళవారం ఆవిష్కరించారు. ధ్వజస్తంభం పునః ప్రతిష్ఠించాలని పాలకమండలి సభ్యులు నిర్ణయించారు. ఆలయ చైర్మన్ నారాయణశర్మ, ఆలయ ఈఓ కట్ట సుధాకర్‌రెడ్డి, ఆలయ ట్రస్ట్ బోర్డు మెంబర్లు నల్ల మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాజు, ప్రవీణ్, ముత్యాలు, దుర్గాప్రసాద్, అమరేందర్, కుమార్, రాజిరెడ్డి, అనిత, శంకరయ్య, సాయిలు, ప్రభాకర్‌గౌడ్, సురేష్‌యాదవ్, బలరామశర్మ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు..

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అష్టమి సందర్భంగా అర్చకులు కాలభైరవ అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణశర్మ, ట్రస్ట్ బోర్డు సభ్యులు నల్ల మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

పరిశుభ్రత ప్రతి పౌరుడి బాధ్యత



మట్టితో గుంతలను పూడ్చివేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పోచారం: పరిసరాల పరిశుభ్రతపై ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశం అన్నారు. మంగళవారం సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కొర్రెముల్ ప్రాంతంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కొర్రెముల్‌లోని వీధులు, ప్రజా ప్రయోజన స్థలాలను శుభ్రం చేసి, రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేశారు. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు అరుణ, సౌజన్య, నవీన్‌కుమార్, దీపక్, ఖలీల్, స్నేహ, పూజ, భార్గవి, సందీప్, రామకృష్ణ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల భద్రతే లక్ష్యం

మేడ్చల్‌లో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



వాహన తనిఖీల్లో డీసీపీ కోటిరెడ్డి, పోలీసు సిబ్బంది

మేడ్చల్‌రూరల్: ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీసులు పనిచేస్తున్నారని, మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి అన్నారు. మంగవారం సాయంత్రం మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో మేడ్చల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. డీసీపీ కోటిరెడ్డి, మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణతో కలిసి పాల్గొని వాహన తనిఖీలు పరిశీలించారు. డీసీపీ మాట్లాడుతూ.. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. తనిఖీల్లో భాగంగా నెంబర్‌ప్లేట్, ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను గుర్తించనున్నట్లు చెప్పారు.

నెంబర్ ప్లేట్ లేనివే అధికం..

పోలీసుల తనిఖీల్లో చాలా వాహనాలకు నెంబర్ ప్లేట్లు సరిగ్గా లేవన్నారు. దొంగిలించిన వాహనాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. దొంగతనాలు అర్ధరాత్రి వేళల్లో జరుగుతున్నట్లు గుర్తించి ఏసీపీ, డీసీపీ స్థాయిలో ముమ్మర తనిఖీలు చేయనున్నామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నామన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

కీసర: కీసరగుట్టలోని గురుకుల పాఠశాల ఆవరణలో పాఠశాలల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి దామోదర్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు. జోనల్ కార్యదర్శి సునీల్‌బాబు, మండల విద్యాధికారి జమదగ్ని, స్కూల్ ప్రధానోపాధ్యాయులు నర్సింహ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య, రమేష్‌రెడ్డి, జిల్లా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్‌గుప్తా, బీఆర్ఎస్ నేతలు భానుశర్మ తదితరులున్నారు.

టపాసుల దుకాణానికి అనుమతి తప్పనిసరి

శామీర్‌పేట: దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని జినోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గోపగాని గురువయ్య సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు పర్మిషన్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. బాణసంచా అమ్మకాలకు దుకాణదారులు 16వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతులు లేకుండా పటాకుల షాపులు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారి దరఖాస్తులు తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. పూర్తి వివరాలకు జినోమ్ వ్యాలీ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాల సందర్శన

శామీర్ పేట: అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల మానసిక, శారీరక అభివృద్ధికి బలమైన పునాది అని, జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా అన్నారు. మంగళవారం మండల కేంద్రం శామీర్‌పేట్, బొమ్మరాసిపేట్ గ్రామాల్లో జిల్లా సంక్షేమాధికారి శారదాతో కలిసి అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పనిచేయాలని, బోధనా విధానం, పోషణ అంశాల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సందర్శించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్న పాఠశాల పూర్వ విద్య, పోషకాహార పంపిణీ, పిల్లల ఆరోగ్య పరిస్థితులు, వయస్సు తగిన అభ్యాస కార్యక్రమాలు, పాఠ్యేతర కార్యక్రమాల నిర్వహణపై సమగ్ర సమీక్ష చేశారు. పిల్లలకు ఆటలు, పాటలు, కథలు, అక్షరాభ్యాసం వంటి మార్గాల ద్వారా నేర్పుతున్న పద్ధతుల పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

◆ శామీర్ పేట అంగన్‌వాడీ కేంద్రంలో ఇటీవల ప్రారంభించిన గోడల పెయింటింగ్ పనులను పరిశీలించారు. పిల్లలకు ఆకర్షణీయంగా, శాస్త్రీయంగా పాఠ్యాంశాలను అందించేందుకు గోడలపై అలంకరణలు, గణితం, అక్షరాలు, ప్రాణులు, పండ్లు వంటి అంశాలతో కూడిన పెయింటింగ్స్ వేసే తీరును చూసి అభినందించారు. సీడీపీఓలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, స్థానిక అంగన్‌వాడీ టీచర్లు, సహాయకులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు పరిశీలన



అవుషాపూర్ సర్వీస్ రోడ్డును పరిశీలిస్తున్న హైవే అధికారులు

ఘట్‌కేసర్: అవుషాపూర్ వద్ద ముంపునకు గురౌతున్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డును జాతీయ రహదారుల పీడీ కీర్తిభరద్వాజ్, స్థానిక మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. సర్వీస్ రోడ్డుపై నీరు నిలిచి మహిళలు, వృద్ధులు, పిల్లలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, హైవేపై లైటింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. మేనేజర్ లింగయ్య, మాజీ ఎంపీటీసీ లక్ష్మారెడ్డి, మచ్చేందర్‌రెడ్డి, భానుయాదవ్, రమేష్‌నాయుడు, వెంకటేష్‌గౌడ్, మహేష్ స్థానికులు పాల్గొన్నారు.

అతివల ఆరోగ్యానికి అండగా..

- 1906 ఆరోగ్య శిబిరాల్లో 71,408 మందికి పరీక్షలు
- రక్తపోటు, మధుమేహం, రక్తహీనత ఉన్నవాళ్లే అధికం
- ఆరోగ్య శిబిరాల్లో స్పెషలిస్ట్‌లతో ప్రత్యేక వైద్య పరీక్షలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళలకు అనారోగ్యం సమస్యలు తలెత్తకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తున్నాయి. కేంద్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాలతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 'స్వస్త్ నారీ.. సశక్తి పరివార్ అభియాన్' పేరిట మహిళలకు ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ నిర్వహించింది. జిల్లాలో సెప్టెంబర్ 17 నుంచి ఈనెల 2 వరకు ఆస్పత్రులు, పల్లెలు, పట్టణాల్లో నిర్వహించిన శిబిరాల్లో వ్యాధుల ముప్పు వెలుగులోకి రావడం ఆందోళనకు గురిచేస్తోంది.

◆ నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరిజిల్లాలో ఏరియా ఆసుపత్రితో సహా మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 12 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 28 అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రతిరోజు 11 ప్రత్యేక వైద్య శిబిరాలు చొప్పున జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 1906 వైద్య శిబిరాల (మెడికల్ క్యాంపులు) ద్వారా మహిళలకు వైద్య నిపుణులచే వైద్య పరీక్షలు, చికిత్సలు నిర్వహించారు. మొత్తం 71,408 మందికి పరీక్షలు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆయా శిబిరాల్లో మహిళలకు బీపీ, షుగర్, క్యాన్సర్, టీబీ, హిమోగ్లోబిన్, గర్భాశయ, మూత్రాశయ, ఇతర క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, దంత, చెవి, ముక్కు, చర్మ, గొంతు, మానసిక సమస్యలపై పరీక్షలు నిర్వహించారు.

రక్తం పోటెత్తుతోంది..

అత్యధికంగా రక్తపోటుతో సహా మధుమేహం, రక్తహీనత బాధితుల సంఖ్య ఉన్నట్లు తేలింది. నిత్యం శారీరక శ్రమ, జీవనాధారమైన పట్టణ ప్రాంతాల్లో ఈ రెండు వ్యాధులు విజృంభిస్తుండటం వైద్యశాఖను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది.

వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించాం



మహిళల్లో వ్యాధి ముప్పును గుర్తించేందుకు చేపట్టిన శిబిరాలను సమర్థవంతంగా నిర్వహించాం. ప్రత్యేక వైద్య నిపుణులు చేసిన పరీక్షల్లో రుగ్మతలు వెలుగుచూశాయి. మధుమేహం, రక్తపోటు, రక్తహీనత బాధితులు అధికంగానే ఉండగా.. అందరికీ మందులిచ్చాం. క్యాన్సర్, ఇతర లక్షణాలను నిర్ధారణ చేయాల్సి ఉంది.

– డాక్టర్ ఉమాగౌరి, డీఎంహెచ్ఓ, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

విద్యారంగం బలోపేతానికి ప్రత్యేక దృష్టి

మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ మనుచౌదరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి తెలిపారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సచివాలయంలో ఉన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీమ్ ప్రగతిని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద నిధులకు సంబంధించిన ఒప్పందం స్కూల్ యాజమాన్యాలు, జిల్లా యంత్రాంగం మధ్య జరిగిందని, ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే పాఠశాల యాజమాన్యాలు జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలే తప్పా.. విద్యార్థులను బయటికి పంపడానికి వీలులేదని డిప్యూటీ సీఎం బట్టి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు, డీఈవోలు, సంక్షేమ శాఖల అధికారులు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకొని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపికైన ప్రతి విద్యార్థి పాఠశాలలో ఉండేలా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని కలెక్టర్లకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు వినోద్‌కుమార్, పద్మజ, కాంతమ్మ, డీఈఓ విజయకుమారి పాల్గొన్నారు.

'ఎన్ఎఫ్‌బీఎస్' పథకం ద్వారా రూ.20 వేలు.

సాక్షి,మేడ్చల్ జిల్లా: జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (ఎన్ఎఫ్‌బీఎస్) కేంద్ర సాయంతో ఎన్ఎస్ఏపీలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, వారి కుటుంబ ప్రధాన జీవనదారు (మహిళ/పురుషుడు) మృతి చెందితే కుటుంబ పోషణ నిమిత్తం బాధిత కుటుంబానికి ఒకేసారి రూ.20 వేలు సాయంగా అందించనున్నట్లు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి పేర్కొన్నారు. ప్రధాన జీవనాదారుడి వయస్సు 18 ఏళ్లకు మించి 60 ఏళ్ల లోపు ఉండాలన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబం మాత్రమే ఈ పథకానికి అర్హులన్నారు. అర్హులైన వారు తమ పరిధిలోని మండల తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం కింద లబ్ధి పొందాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు.

'రైజింగ్ విజన్ -2047' సర్వేలో ఉద్యోగులంతా పాల్గొనాలి..

సాక్షి,మేడ్చల్ జిల్లా: భవిష్యత్తులో రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్ -2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా రూపొందిస్తున్న విజన్- 2047 డాక్యుమెంట్ తయారీలో ప్రతి ఒక్క పౌరుడు భాగస్వామ్యమయ్యేలా సిటిజన్ సర్వే చేపట్టారన్నారు. ఈనెల 25 వరకు జరిగే విజన్-2047 సర్వేలో ఉద్యోగులందరూ పాల్గొనడంతో పాటు సర్వే లింక్, క్యూఆర్‌కోడ్‌ను తమ తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు.